విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కలెక్టర్ రాజాబాబును కలిసిన కర్లపాటి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణ జిల్లా పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అంబడ్స్ పర్సన్‌గా నియమితులైన సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ రాజాబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ కూడా కలిసి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఘనంగా యోగ దినోత్సవం

విశాలాంధ్ర-మచిలీపట్నం : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ముడా ఛైర్మన్ బొర్రా నాగ దుర్గా భవాని విఠల్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముడా ఛైర్మన్ బొర్రా నాగ దుర్గా భవాని విఠల్ పాల్గొన్నారు. ముదిగొండ శాస్త్రి రచించిన యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పుస్తకాన్ని ముడా ఛైర్మన్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని యోగా గురువులు గురునాధ బాబు, మహాలక్ష్మి దంపతులకు అంకితం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ బోర్ర విటల్, బందరు డి.ఎస్.పి మాధవరెడ్డి, ఏఆర్డిఎస్పి కే వెంకటేశ్వరరావు, ఆర్ డి ప్రసాద్, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనా లేక వైసీపీ కమిషనా.?

విశాలాంధ్ర-మచిలీపట్నం : వైసిపి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో కుట్రపూరితంగానే ఓటర్ల జాబితాను తారుమారు చేస్తుందని మాజీమంత్రి కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం లో ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆశ్రయించడం జరిగిందని ఆయన తెలిపారు. న్యాయస్థానం మేము ఆధారాలతో ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని విశ్వసించి ఎన్నికల సంఘానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విజయాన్ని మేము గత రెండు సంవత్సరాలుగా స్థానిక ఎమ్మార్వో కి ఆర్డిఓ కి కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదు అందుకే ఈరోజు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా వైసీపీ రంగు పులుముకుందని, రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైఎస్ జగన్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ తాను మాత్రం ఓట్ల రాజకీయాలు చేసి గెలవాలని చూడడం అవివేకమని ఆయన వెల్లడించారు. మచిలీపట్నం లోని ఎస్సి బాలిక వసతి గృహంలో విద్యార్థిని పై జరిగిన లైంగిక దాడి పై స్పందించాలని ఆయన అన్నారు. రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ నిందితులతో లాలూచీపడి గంజాయి సరఫరాకు సహకరిస్తున్నారేమోనని అనుమానం ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్ ,మోటమర్రి బాబా ప్రసాద్, ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంత రావు, కార్పొరేటర్లు దింటకుర్తి సుధాకర్ బాబు, సమతా కీర్తి, దేవరపల్లి అనిత, న్యాయవాదులు లంకె వెంకటేశ్వరరావు, పుప్పాల ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర-కూచిపూడి : కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం నెలాఖరు లోపుగా దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని పెదపూడి సచివాలయ వీఆర్వో జే. కోటేశ్వరరావు, వీఏఏ ఎం. శ్రావణి లు రైతులకు సూచించారు. పెదపూడి సచివాలయ రైతు భరోసా కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు పెదపూడి, యద్దనపూడి గ్రామాల నుంచి విచ్చేసిన 16 మంది కౌలు రైతులు అర్జీలను దాఖలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీటి ద్వారా లబ్ధి పొందుతున్న కౌలు రైతులందరూ భూమి యజమానుల అనుమతితో అర్జీలు అందజేయాలని సూచించారు. 11 నెలలు మాత్రమే ఉపయోగపడే ఈ కార్డులు వలన భూమి యజమానులు ఏ విధమైన ఇబ్బందులు ఉండవని వీటిపై ఏమైనా అనుమానాలు ఉంటే తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి తమ అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చునని భూమి యజమానులకు సూచించారు. కాగా పెదపూడిలో 40 మంది, యద్దనపూడి లో 80 మంది కౌలు రైతులు కలిపి120 మంది కౌలు రైతులుండగా సమావేశానికి కేవలం 16 మంది మాత్రమే హాజరు కావడం గమనార్హం!!.

ఉప్పాల రాంప్రసాద్‌కు నివాళులు

విశాలాంధ్ర-గుడివాడ : బీసీ సంఘ అధ్వర్యంలో డిసిసి మాజీ ఛైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ మృతికి సంతాప కార్యక్రమాన్ని స్థానిక ముగ్గు బజార్ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద నిర్వహించారు. ఉప్పాల రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, నాయకులు గులిపల్లి ప్రభాకరరావు, వడ్డే గోవర్ధనరావు, జోగా సూర్యప్రకాష్‌రావు, పుల్లేటికుర్తి వినయ్‌కుమార్, షేక్ సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

గౌడపాలెం రహదారికి మోక్షం

విశాలాంధ్ర-పమిడిముక్కల: కృష్ణాపురం శివారు గౌడపాలెం రహదారి కొన్ని సంవత్సరాలుగా అధ్వాన్న స్థితిలో ఉండి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం సదరు రహదారి కి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో సి.సి.రోడ్డు వేస్తారని, యం.పి.నిధుల నుండి రూ.10లక్షలు, ఎమ్మెల్యే నిధులు నుండి రూ.10లక్షలు జెడ్పీటీసీ నిధులు నుండి రూ.10లక్షలు మంజూరు చేశారని సచివాలయ కన్వీనర్ పరసా జగన్ మోహన్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ యంపిటిసి వీరంకి చిరంజీవి వై.శివనాగ మల్లేశ్వర రావు కాగిత వెంకట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం మెరుగుకు యోగా దోహదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపర్చడంలో యోగా సహాయపడుతుందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) అమరావతి-ప్రాంతీయ విభాగం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషి అన్నారు. ప్రాంతీయ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశానికి ఎఫ్‌సీఐ పెద్దఎత్తున ఆహార భద్రతను కల్పిస్తోందన్నారు. దినచర్యలో యోగా ప్రధాన భూమిక వహిస్తోందని చెప్పారు. ప్రతిరోజు యోగాను ఉద్యోగులు చేస్తూ మానసిక ఉల్లాసం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పాల రాంప్రసాద్‌కు వేదవ్యాస్ నివాళులు

విశాలాంధ్ర-పెడన: దివంగత ఉప్పాల రాంప్రసాద్ కు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ నివాళులు అర్పించారు. పెడన మండలం కూడూరు పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి వెళ్లి రాంప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఆయన కుమారుడు రామును పరామర్శించారు రాంప్రసాద్ తో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ పర్యటనలో గూడూరు మండలం మాజి జడ్పీటీసీ బూరగడ్డ శ్రీ కుమార్ కాగిత చంటి పుప్పాల నరసింహారావు గంధం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్ బి కే లు, హెల్త్ క్లినిక్ భవనాలు సెప్టెంబర్ ఆఖరు నాటికి నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, నాడు- నేడు క్రింద అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో పంచాయతీరాజ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. జిల్లాకు మంజూరైన 387 గ్రామ సచివాలయ భవనాలకుగాను ఇప్పటిదాకా 172 పూర్తి కాగా, మరో 47 పూర్తయ్యే దశలో ఉండగా, పునాది స్థాయిలో 77, మొదటి అంతస్తు స్లాబ్ స్థాయిలో 37, రెండో అంతస్తు స్లాబ్ స్థాయిలో 34 భవనాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 378 ఆర్బికే భవనాలు మంజూరు కాగా ఇప్పటిదాకా 99 పూర్తి కాగా, మరో 22 పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. బేస్మెంట్ లెవెల్ 135, రూఫ్ లెవెల్లో 60 ఉన్నాయనీ, వై ఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు జిల్లాకు 268 మంజూరు కాగా, ఇప్పటిదాకా 67 పూర్తికాగా, మరో 16 పూర్తయ్యే దశలో ఉండగా, బే స్మెంట్ లెవెల్లో 90, రూఫ్ లెవెల్ 51 ఉన్నాయన్నారు. డి ఇ ల వారీగా కలెక్టర్ సమీక్షిస్తూ వివిధ నిర్మాణ దశల్లో ఉన్న భవనాలను పూర్తి చేయుటకు గడువు నిర్దేశించారు. బేస్మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్ ఉన్న వాటిని ఆగస్టులోగా పూర్తి చేయాలని, పనులు వేగవంతం గావించి సెప్టెంబర్ నెలాఖరులోగా అన్ని పూర్తి చేయాలన్నారు. జగనన్న లేఔట్లలో మెరక పనులు, అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్ల పనులు వేగవంతం గావించాలని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద జిల్లాలో పిఆర్ చేపట్టిన 477 పనులలో 140 పూర్తి కాగా, 276 పనులు పురోగతిలో ఉన్నాయని, 61 పనులు ప్రారంభించవలసి ఉందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ కె.విజయకుమారి, ఈ. ఈ. ఏవీఎస్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డిఇ, ఏఇలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రజలకు ఎంతో ఉపయోగపడే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చల్లపల్లి తహసీల్దార్ కె. గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్, ఆదాయ, జనన మరియు మరణ, వివాహ, కుటుంబ ధృవీకరణ పత్రములు, ఆధార్ నెంబరును మొబైలు జతచేయుటం, కౌలురైతు కార్డులు, నూతన రైస్ కార్డుల మంజూరు, ఈ పాస్బుక్ తదితర 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్, కార్యదర్శులు పివి. మాధవేంద్రరావు, ఆకుల సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

థియరీ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో నిర్వహించే థియరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కూచిపూడిలో డిప్లమో యక్షగానం, డిప్లమో సాత్వికాభినయం పరీక్షలకు విద్యార్థులు హాజరైనారు. ఆ కళా పీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలకు డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని పరీక్షా ధికారిగా వ్యవహరించారు.

జండులో డిజిటలైజేషన్ ఇ - స్టాంపులు ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : దశాబ్దకాలం నుండి ప్రజలకు అందుబాటులో ఉండే జండులో స్టాంపుల స్థానంలో డిజటలైజేషన్ భాగంగా ప్రభుత్వం ఇ-స్టాంపులను ప్రారంభించడం అభినందనీయమాని వైసీపీ సినీయర్ జిల్లా నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జండు యాజమాని దినవహి ఉమాకుమార్ నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజటలైజేషన్ ఇ-స్టాంపులను వైసీపీ సినియర్ జిల్లా నాయకుడు మండలి హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో 100, 50, 20,10రూపాయిల నాన్‌జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ప్రభుత్వం జండుకు ఇ-స్టాంపు లైసెన్సు మంజూరు చేసిందన్నారు. అఫిడవిట్లు చేయడం, బ్యాంకలకు ఫైనాన్సు కంపెనీలకు అగ్రిమెంట్లుకు ఇ-స్టాంపింగ్‌ను ఉపయోగించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో షయ్యద్ గఫర్, నందూరి బద్రినాథ్, డి.యస్,బి మౌళి తదితరులు పాల్గొన్నారు.

'గోబర్ ధన్' ప్లాంట్ ఏర్పాటుకు పెదముత్తేవి ఆశ్రమ స్థల పరిశీలన

విశాలాంధ్ర-కూచిపూడి : కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే గోబర్ ధన్ ప్లాంట్ ఏర్పాటు కోసం పెదముత్తేవిలోని శ్రీకృష్ణాశ్రమంలో గల గోశాలలను , స్థలాలనుకృష్ణాజిల్లా పంచాయతీ అధికారి ఎస్. వి. నాగేశ్వర నాయక్ బుధవారం పరిశీలించారు. ఆయన డి ఎల్ పి ఓ లు ఐ.జ్యోతిర్మయి(మచిలీపట్నం), జి సంపత్ కుమారి (గుడివాడ, ఉయ్యూరు ఇంచార్జి), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీతారామయ్య (మచిలీపట్నం) లతో కలిసి ఆశ్రమంలో గల గోబర్ గ్యాస్ ప్లాంట్లను, గోశాలలను, స్థల విస్తీర్ణాన్ని పరిశీలించి దీనికి సంబంధించిన వివరాలను సేకరించారు. శ్రీకృష్ణ ఆశ్రమంలో గల ఆరుఎకరాల విస్తీర్ణంలో 500 ఆవులతో నిర్వహిస్తున్న పది గోశాలలతీరుతెన్నులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా మంజూరు చేసే గోబర్ ధన్.ప్లాంట్ కోసం అనువుగానున్న స్థల పరిశీలన చేయాలని జారీ చేసిన ఆదేశాలతో ఆయన పెదముత్తేవి ఆశ్రమ ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆవుల పోషణకు సంబంధించిన విషయాలపై కూడా ఆరా తీశారు.దీనికి సంబంధించిన పలు విషయాలను ముముక్షు జన మహా పీఠాధిపతి ముక్తేశ్వీసీతారాం, ఆశ్రమ వాసులు తుర్లపాటి రాధాకృష్ణ, తుర్లపాటి ఆనంద్ లతో క్షుణ్ణంగా చర్చించారు. త్వరలో సాంకేతిక నిపుణుల బృందం వచ్చి ప్లాంట్ నిర్మించే విషయంపై చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న, ఇన్చార్జి కార్యదర్శి దేగల ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శులు ఏ డి వి ఎల్ ప్రసాద్ (కాజ)ఇస్లావత్ భవాని (కూచిపూడి) తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్వాడీలో చేర్చండి

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామంలో ని మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ లో చేర్పిస్తే వారికి ప్రభుత్వం అందిస్తున్న పదార్థాలు అందుతాయని వారి ఎదుగుదల కు దోహద పడుతుందని ఐనంపూడి సర్పంచ్ యేనుగ బేబి అన్నారు.బుధవారం ఐనంపూడి అంగన్వాడీ కేంద్రం లో గ్రాడ్యుయేషన్ డే జరిగింది.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉష మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు జగనన్న గోరుముద్ద చిక్కీలు అలాగే గర్భిణీ స్త్రీలకు పలుసేవలు అందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఆశా వర్కర్లు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకి ఆషాడం సారె

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కనకదుర్గ లలిత పారాయణ బృందం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కు ఆషాడ సారె సమపర్పణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కొత్త గుళ్ల సమీపంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆర్యవైశ్య కళ్యాణ మందిరం నుండి కేరళ డప్పు వాయిద్యల, సన్నాయి మేళాల నడుమ మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు తోపాటు కన్యకా పరమేశ్వరి కమిటీ సభ్యులు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం ఆధ్వర్యంలో అమ్మ వారికీ ఆషాడ మాస లో సారె సమర్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. కనకదుర్గ లలితా పారాయణం బృందం ఆధ్యాత్మిక సేవలో తరిస్తూ దేవాలయాలలో కార్యక్రమలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ చాంబర్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, దుర్గా మల్లేశ్వర స్వామి ట్రస్ట్ సభ్యులు బుద్ద రాంబాబు, కట్ట సత్తయ్య, కేసరి నాగమణి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి సుబ్బు, శ్రీ కన్యకా పరమేశ్వరి సత్రం అధ్యక్షుడు మరియు కార్యదర్శులు బచ్చు వెంకట లక్ష్మీ వరప్రసాద్, బయన రాజేష్, తదితర సభ్యులు, భక్తి బృంద లు సారె ఊరేగింపులో పాల్గొని ఆరాధించి కొండపై అమ్మవారికి సమర్పించారు.

జెడ్పీ హైస్కూల్‌లో సీసీ కెమేరాలు

విశాలాంధ్ర-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో దాత ల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రావివారిపాలెం కు చెందిన కోనేరు కృష్ణమూర్తి, నాగేంద్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు కోనేరు పద్మనాభ ప్రసాద్, ఉప సర్పంచ్ సుందర్ సింగ్, రమేష్ బాబు ల సహకారంతో రూ. 1,16,116 నగదుతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి ఆధ్వర్యంలో మంగళవారం దాతలు సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ప్రముఖులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ నందిగం మేరీ రాణి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు చిట్టిబొమ్మ వెంకటరమణ లతో పాటు పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌బాబుకు మండలి పరామర్శ

విశాలాంధ్ర-చల్లపల్లి : మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ బుధవారం చల్లపల్లిలో పలు పరామర్శల్లో పాల్గొన్నారు. తెలుగుయువత నాయకుడు మట్టా అశోకా బాబు తండ్రి కోటయ్య స్వామి ఇటీవల మరణించగా, సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని కోటయ్యస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గౌడపాలెంలో టీడీపీ కార్యకర్త చిముటూరి వీరబాబు సతీమణి ఉమారాణి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మా రాంబాబు, పైడిపాములు కృష్ణకుమారి, పైడిపాములు స్వప్న, రావి చిట్టి, మోర్ల శివ, కైతేపల్లి లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే జనసేనాని ఉన్నాడు

విశాలాంధ్ర-మచిలీపట్నం : జనసేనని వారాహి యాత్రం చూసి ప్రతిపక్షాల గుండెల్లో వణుకు మొదలైందని మచిలీపట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలైన ముద్రగడ్డ పద్మనాభం కాపు కులానికి ఏం చేయలేదని, అటువంటి వ్యక్తి నీతి నిజాయితీ గల జనసేన ని పవన్ కళ్యాణ్ ని లేఖ ద్వారా విమర్శలు గుప్పించడం తగదని ఆయన ఎద్దేవా చేశారు. కౌలు రైతుల కోసం పవన్ కళ్యాణ్ కష్టార్జితాన్ని పంచడం జరిగిందే తప్ప, మీకు లాగా కులాన్ని ఎక్కడ అడ్డం పెట్టుకోలేదని ఆయన అన్నారు. మీరు ఏదో మీరు పదవిని ఆశించి సేనానిని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వాలి శెట్టి నాగేంద్రరావు, వడ్డీ చిరంజీవి కుమార్, శివ, వీర మహిళలు కుమారి, హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థినీలకు యూనిఫాం వితరణ

విశాలాంధ్ర-చల్లపల్లి : దాతల సహకారం అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. మచిలీపట్నంకు చెందిన చల్లపల్లి రాజేశ్వరి వారి భర్త లక్ష్మీకాంతారావు జ్ఞాపకార్థం పురిటిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థినిలకు రూ.35వేల విలువైన యూనిఫాం, స్టడీ మెటీరియల్, రికార్డ్ బుక్కు అందించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని జంపాన చంద్రిక ద్వారా వాటిని అందచేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతులమీదుగా విద్యార్థినిలకు యూనిఫాం, స్టడీ మెటీరియల్లు అందించారు. హెచ్ఎం కెబిఎస్.శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రాంబాబు, మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, నాదెళ్ల శివరామకృష్ణయ్య, కర్రా సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణ, కె.రమేష్, జి.పావని, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉమా సరస్వతి, సుజాత, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. వేసవిలో హైస్కూల్లో గ్రంథాలయ నిర్వహణ, రాము మాస్టారిచే డ్రాయింగ్ తరగతులు, యోగా తరగతులు జరిగాయి. ఆయా అంశాల్లో ప్రతిభ చూపిన వారికి విశ్రాంత రవాణాశాఖ అధికారి నాదెళ్ల శివరామకృష్ణయ్య బ్యాగ్స్, టీ షర్టులు, పుస్తకాలను బహుమతిగా అందచేశారు.

యలమర్రులో గ్రాడ్యుషన్ డే

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు గ్రామ అంగనవాడి కేంద్రంలో గ్రాడ్యుకేషన్ డే వేడుకలు గ్రామ సర్పంచ్ కొల్లూరు అనూష అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. శివ నాగమణి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి ఐదు సంవత్సరముల వరకు ముఖ్యమైన రోజులుగా భావించి మూడో సంవత్సరంలో స్థానికంగా ఉన్న అంగన్వాడి కేంద్రాలలో చేర్పించి వారికి ఆదిలోనే పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు విద్య ఆట పాటలు అందించేందుకు ప్రభుత్వం ప్రీ స్కూల్ సిలబస్సు కూడా అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ ఇచ్చి స్థానిక ఎంపీపీ పాఠశాలల్లో చేర్పించడం కూడా జరుగుతుందని సూపర్వైజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఖరీఫ్ సీజన్‌లో అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు కమీషనర్లు, ఎంపీడీవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలోని స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయాధికారులతో క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు(సీసీఆర్సీ కార్డులు), జగనన్న సురక్ష, జగనన్న లేఔట్‌లో గృహ నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, నాడు-నేడు, జగనన్న తోడు అంశాలపై కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున కౌలు రైతులుకు అందిస్తున్న క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డులను నిర్ణీత సమయానికి పంట ప్రారంభ దశలోనే అందజేస్తేనే వారికి ప్రయోజనమన్నారు. వ్యవసాయ శాఖాధికారులు కౌలు రైతుల వివరాలను సకాలంలో బ్యాంకులకు అందించడం ద్వారా బ్యాంకు రుణాలు త్వరితగతిన అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీఎం ఈ నెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం 24 నుండి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కార్యక్రమాన్ని వివరించాలన్నారు. జగనన్న లేఔట్‌లోని గృహ నిర్మాణాలు డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో వెనుకబడిన మండల అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ నూరు శాతం పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ పీ.సంపత్‌కుమార్, డీఆర్‌వో కే.మోహన్‌కుమార్, డీఆర్‌డీఏ కే.శ్రీనివాస్, హౌసింగ్ పీడీ రజినికుమారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.నాగమణమ్మ, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలతో ప్రజల బెంబేలు

-ఐక్య ప్రజాపోరాటాలతో ప్రతిఘటిద్దాం: సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో మున్నె న్నడూ లేనంతగా 4 సంవత్సరాల కాలంలో 7 దఫాలుగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రభుత్వం ఇచ్చిన షాక్‌తో రాష్ట్ర ప్రజలు బెంబేలెత్తి పోతున్నారని, సమైక్య ప్రజాపోరాటాలతో ఈ ప్రమాదాన్ని ప్రతిఘటించా లని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐతో పాటు పది వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా విజయ వాడ రూరల్ మండల కొత్తూరు తాడేపల్లిలో బుధవారం జరిగిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడిలకు తలొగ్గి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, షాపులకు, నివాస ఇళ్లతో సహా స్మార్ట్ మీటర్లు బిగించడానికి అంగీకరించి ప్రజలపై వేలకోట్ల రూపాయల భారం మోపడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. ఇప్పటికే మనం చెల్లించే చార్జీలకదనంగా మరో ఆరు రకాల ఫిక్స్ చార్జీల, కస్టమర్, విద్యుత్ డ్యూటీ, ట్రూఆప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు పేరుతో రెండు రకాల చార్జీలు వేసి ప్రజలపై మోయలేని వేలకోట్ల రూపాయల భారాన్ని వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చైతన్యంతో ఈ ధరల ప్రతిఘటనా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుద్ది రమేష్, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సీహెచ్.దుర్గాకోటేశ్వరరావు, మాట్లాడారు. స్థానిక సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు ఇతర పెద్దలు కె.లింగయ్య, వీరాస్వామి, లక్ష్మయ్య, భూక్యా దేశ్య, తుపాకుల రాయప్ప, ఇండ్ల లక్ష్మీనారాయణ, కంపా లక్ష్మయ్య, ఇస్లావతు నాగులు, దుర్గ, ఇస్లావతు పీకి,భూక్యా తిరుపతమ్మ, భూక్యా కేసీఆర్ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

విశాలాంధ్ర

ఎన్టీఆర్ జిల్లా

రేపు విద్యుత్ చార్జీల పేరుతో

నిలువు దోపిడీపై రౌండ్‌టేబుల్

-రైతుల నడ్డి విరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
-టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చే వరకు పోరాటాలు : దోనేపూడి హెచ్చరిక

విశాలాంధ్ర-వత్సవాయి : ట్రూఆప్ చార్జీలు, సర్‌చార్జీలు అంటూ వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలు భారీగా పెంచి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 23వ తేదిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి అంభోజీ శివాజీ ఆధ్వర్యంలో పట్టణ సీపీఐ పార్టీ కార్యదర్శి జూనె బోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శంకర్ మాట్లాడుతూ జగ్గయ్యపేటలోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై పెను భారాన్ని మోపిందని విద్యుత్ సర్‌చార్జీలు, అధిక ధరలు మొదలగు వాటితో పేదవాడి నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుదలను విరమించుకోవాలని లేనిపక్షంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా టిడ్కో గృహాల పరిశీలన చేసి లబ్ధిదారులకు న్యాయం చేకూరే వరకు నిర్విరామంగా పోరాటాలు చేస్తూనే ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వదిలిపెట్టి లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీపర్చాలని హితవు పలికారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి చరమ గీతం పాడే అంతిమ ఘడియలు త్వరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు ఏవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంక గోవిందరాజులు జిల్లా కౌన్సిల్ సభ్యులు తాడి పైడయ్య సీపీఐ పార్టీ నాయకులు మెటికల శ్రీనివాసరావు ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండపల్లి భాను మహిళా సమైక్య నాయకురాలు మాడుగుల విజయరాణి ,పార్టీ సీనియర్ నాయకులు భోగ్యం నాగులు వత్సవాయి మండల కార్యదర్శి జానీ కమ్యూనిస్టు పార్టీ నాయకులు దారెల్లి కొండ తదితరులు పాల్గొన్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

- హర్యానాకి చెందిన 728 మద్యం సీసాలు స్వాధీనం - ఒకరి అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: హర్యానా రాష్ట్రం నుంచి భారీగా అక్రమ మద్యం పట్టుబడింది. విజయవాడ శ్రీనివాస్ నగర్ బ్యాంక్ కాలనీకి చెందిన జొన్నలగడ్డ లీలాకుమార్‌ను అరెస్టు చేశారు. అతని ఇంట్లో అక్రమంగా దాచిన 728 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గురునానాక్ కాలనీలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రామకృష్ణ కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బ్యాంక్ కాలనీకి చెందిన లీలాకుమార్ హర్యానా రాష్ట్రాంకు వెళ్లి అక్కడ మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తన ఇంట్లో దాచి పెట్టి అమ్మకాలు చేస్తున్నాడని తెలిపారు. ఈదాడుల్లో ప్రతిభ కనబరిచిన ఈస్ట్ ఎస్‌ఈబీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నిక్సన్, డీఎస్‌డీఈవో టీంకు చెందిన ఎస్సై కె.నాగేశ్వరరావు, ఆర్‌ఎస్సైలు భరత్ నాయుడు, రవిప్రసాద్, ఇతర సిబ్బందికి రివార్డ్స్ ప్రకటించారు.

కృష్ణలంకలో వరుసగా సెల్ ఫోన్ స్నాచింగ్‌లు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: కృష్ణలంకలో రెండు ప్రాంతాల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్ జరిగింది. అర్ధరాత్రి ఆటోడ్రైవర్ సెల్ ఫోన్‌తో పాటు మరో యువకుడి సెల్‌ఫోన్ లాక్కొని గుర్తుతెలియని దుండగులు పరారైయ్యారు. కృష్ణలంకకు చెందిన పవన్ తన స్నేహితుడితో కలిసి అర్ధరాత్రి ఫుడ్ కోర్టు వద్ద ఉన్నారు. గుర్తుతెలియని ముగ్గురు దండగలు ఒక బైక్ పై వచ్చి పవన్ అతని స్నేహితుడి పై దాడి చేశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకువని పరారైయ్యారు. అలాగే పీవీపీ మాల్ సమీపంలో ఆటోడ్రైవర్ ఓలా బుకింగ్ కొసం వెచ్చి ఉండగా బెంజిసర్కిల్ నుండి బైక్ వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ఆటోడ్రైవర్ చేతిలో ఉన్న ఫోన్ స్నాచింగ్ చేశారు. ఈ ఘటన పై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు.

నేడు విద్య ఉపాధి అవకాశాలు - ఆంగ్ల మాధ్యమం ఆవశ్యకత అంశంపై సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ : సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గురువారం "విద్య ఉపాధి అవకాశాలు - ఆంగ్ల మాధ్యమం ఆవశ్యకత" అంశం పై సదస్సు తన అధ్యక్షతన నిర్వహించనున్నట్లు చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మొఘల్‌రాజపురంలోని సీఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో ఈ సదస్సును ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, కాలమిస్ట్ వెంకట్ పూల బాల రచించిన 'ఆంగ్ల పద్య సంపుటి' ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవరత్నాలు ప్రోగ్రామ్ ఎక్సిక్యూటివ్ వైస్ చైర్మన్ ఏఎస్. నారాయణ మూర్తి, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ వీవీఆర్.కృష్ణంరాజు కృష్ణం రాజు, నాగార్జున యూనివర్సిటీ యూనివర్సిటీ గెస్ట్ ఫాకల్టీ ఎస్‌ఏ. రెహమాన్, సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్, జర్నలిస్టులు పాల్గొంటారని ఆ ప్రకటనలో వివరించారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్స్‌ను తొలగించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : గిరిజనుల ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు తక్షణం తొలగించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన పార్టీ కార్యక్రమం కోసం కొత్తూరు తాడేపల్లి వెళుతున్నట్లు సమాచారం తెలుసుకున్న గిరిజనులు (లంబాడి, యానాది, ఎరుకుల కులానికి చెందిన) కోటేశ్వరరావును కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుద్ది రమేష్, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సీహెచ్.దుర్గాకోటేశ్వరరావు సీపీఐ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు కలిసి గిరిజనులు నివాస ప్రాంతానికి వెళ్లి స్వయంగా సమస్యను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లనంటి పెట్టుకుని తూర్పు సరిహద్దున నేలపైనే హైపవర్ ట్రాన్స్‌ఫార్మర్, హైటెన్షన్ విద్యుత్ తీగలు, తుప్పపట్టి డ్యామేజ్ అయిన ఫ్యూజు బాక్స్‌లతో ఉన్న ఆ ప్రాంతంలో ఏ మాత్రం ఏమరపాటుతో మెసిలినా షాక్‌కు గురై మాడిపసైయ్యేంత మృత్యువు ముంగిట ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని దినదిన గండంగా గిరిజనులు కాలం వెలిబుచ్చుతున్నారని ఆందోళన చెందారు. తక్షణ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ నుంచి తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇది తమకు ప్రాణాంతకంగా ఉందని, పొలాలు ఇటు వైపు ఎక్కువగా ఉన్నందువల్ల తమే కాకుండా గ్రామస్తులు, అన్ని కులాల వారు ఈ రహదారినే రాకపోకలు సాగిస్తారని ఇరిజనులు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల అందరికీ ప్రమాదమేనని, ముఖ్యంగా తమపిల్లలు, జీవాలకు మరింత ప్రమాదమని కోటేశ్వరరావు ముందు గొల్లుమన్నారు. దీనిని తొలగించమని అధికారులకు ఎన్నిసార్లు చెప్పుకున్నా తమ మొర ఆలకించలేదని వాపోయారు. ఒక్క లంబాడిలే 200 కుటుంబాలకుపైగా ఉండగా, ప్రక్కనే యానాదలు, ఎరుకుల, బీసీలు ఉన్నారని అందరికీ ఇదే రహదారి అని తెలిపారు. ఇక్కడే సత్తెమ్మ గుడి కూడా ఉందని, ఎప్పుడూ ఈ దారి రద్దీగా ఉంటుందన్నారు. ఇక్కడ ఖాళీ ప్రదేశం ఉందని పిల్లలు వచ్చి ఆడుకుంటారని చెప్పారు. ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చిపడుతుందోనన దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా జీవిస్తున్నామని వారి గోడునెళ్లమార్చుకున్నారు. అంతేకాకుండా పంచాయితీ చెత్త, మురుగు కూడా ఈ రోడ్డు ప్రక్కనే పోసి మా ఆరోగ్యాలను కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్నారని చెప్పారు. ఆ ప్రాంతంలో చెత్త,మురుగు ఉన్న విధానాన్ని పరిశీలించిన అనంతరం కోటేశ్వరరావు వారితో మాట్లాడుతూ మిమ్మల్ని కలుపుకుని ఇక్కడ ఉన్న ప్రమాదాన్ని, జరుగుతున్న నష్టాన్ని అధికారులను కలిసి వివరిద్దామని చెప్పారు. అప్పటికీ సరైన సమాధానం రాకపోతే పోరాటానికి సిద్ధమవుదామని స్పష్టీకరించారు. భూక్యా దేశ్య, ఇస్లావతు లాల్ సంగ్, భూక్యా గోపి, ఇస్లావతు గోపయ్య, ఇస్లావతు లాల్ సంగ్, ఇస్లావతు పీకి, తీర్పి, ఇస్లావతు కోటి, హూనా, కుంచం లింగయ్య, లక్ష్మయ్య, వీరాస్వామి, అనేక మంది ఈ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదనను ఏకరువు పెట్టారు.

యోగాను అభ్యాసంగా మార్చుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మానసిక, శారీరక ఒత్తిడులను జయించి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు యోగాను నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలని క్రీడలు, యువజన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీ.వాణిమోహన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల శాఖ, బాపు మ్యూజియంలో బుధవారం క్రీడలు, యువజన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీ.వాణిమోహన్ యోగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో యోగా ఒక సాంప్రదాయంగా ఉందని, క్రీ.పూ.5 వేల సంవత్సరాల క్రితమే ఉందన్నారు. యోగాతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయని, నూతనోత్తేజం లభిస్తుందని, ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలగడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఆమె స్పష్టం చేశారు. అనంతరం యోగాపై ప్రజలకు అవగాహనకు బాపుమ్యూజియము నుండి మొఘల్రాజపురం గుహల వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేదిక్ డాక్టర్లు డాక్టర్ మాణిక్యేశ్వరరావు, పూర్ణరాజేశ్వరి, పురావస్తు శాఖాధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు అఖిలపక్ష సమావేశం

విశాలాంధ్ర-తిరువూరు: ఈనెల 23న స్థానిక సుంకర వీరభద్రరావు భవన్ లో పెంచిన విద్యుత్ చార్జీలపై అఖిలపక్ష (రౌండ్ టేబుల్) సమావేశము ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సీపీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్న విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీల పెంపుదల, ఇంధన సర్దుబాటు చార్జీల పెంపుదలను ప్రభుత్వం రద్దు చేయాలని, రైతులకు స్మార్ట్ మీటర్లు వినియోగం పై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చ జరిపి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఉదయ్ తెలిపారు. తిరువూరు పట్టణలోని అన్ని రాజకీయ పార్టీలను ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానిస్తున్నామని, అన్ని పార్టీల నాయకులు పాల్గొని, తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

వేగంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్థానిక పీడబ్ల్యూగీ గ్రౌండ్‌లో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ, స్మృతివనం పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ ప్రాజెక్టు పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుపై నిత్యం సమీక్ష నిర్వహిస్తూ వారంలో మూడు, నాలుగు సార్లు పనులను పరిశీలిస్తున్నారు. అంతేకాక రాత్రి సమయాల్లో కూడా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేస్తూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పనుల్లో వేగం పెంచుతున్నారు. రేయం భవళ్లు పని చేస్తున్న కార్మికుల భద్రతకు కూడా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతమైన 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతి నిర్మాణం డిజైన్ల ఆధారంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచి, సీలింగ్, ప్లాస్టింగ్ గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

రాజీవ్‌నగర్ కాలనీ రహదారికి మోక్షం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాజీవ్‌నగర్ కాలనీ రహదారి పనులను ఎట్టకేలకు బుధవారం నరేగా సిబ్బంది ఆరంభించారు. మండల కేంద్రమైన విస్సన్నపేట నుంచి ఇదే పంచాయతీలో ఉన్న రాజీవ నగర్, కోలేటి ఎస్సీవాడ వాసులకు చేరువగా గతంలో ఉన్న రహదారి ఆక్రమణల పాలై, రాకపోకలు నిలిచిపోయాయి. దీన్ని పునరుద్ధరించటం ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు సదుపాయం కల్పించాలని రాజీవ్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ పేరుతో స్థానికులు పలుమార్లు అధికారులను వేడుకున్నారు. అధికారులు సైతం ఇందుకు సమ్మతించినా, రెవిన్యూశాఖ సర్వే చేయటం, నరేగా నిధులు కేటాయించటంలో జాప్యం నెలకొనటంతో గత మూడు సంవత్సరాలుగా ఈ పనులు ఆరంభానికి నోచుకోలేదు. ఈ విషయమై గతంలో 'విశాలాంధ్ర' పలుమార్లు కథనం ప్రచురించటంతో మండలపరిషత్తు అధికారులు స్పందించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ చొరవ తీసుకుని, నిధుల విడుదలకు కృషి చేశారు. మరోవైపు పంచాయతీ కార్యనిర్వహణాధికారి బీఎస్ఎస్.శ్రీనివాసరావు, పాలకవర్గం రెవిన్యూశాఖకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించి, సర్వే పనుల వేగవంతానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో సమస్యలు తొలగి, పనులు ఆరంభమయ్యాయి. రహదారి పనుల ఆరంభం పట్ల రాజీవ్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.మోహనరావు, శీలం శ్రీనివాసరావు, పలువురు సభ్యులు పనుల ఆరంభ కార్యక్రమంలో హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌జీ కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ : 26 సంవత్సరాలుగా ప్రపంచ మార్కెట్‌లో గృహోపకరణ రంగంలో ప్రజల నమ్మకాన్ని పొందుతున్న ఎల్‌జీ కంపెనీ వారు సీఎస్ఆర్ రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయటాకీస్ సోనోవిజన్ షోరూం నందు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హంగ్ జూ జీయూన్ ఈ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయటం వలన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎఫ్ఓ సీయోవేయాంగ్, జీటీఎం హెడ్ అశీష్ అగర్వాల్, ఎఫ్ఎస్ఈ హెచ్‌ఆర్ కిమ్ జ్వా నమ్, ఇండియా-4 సేల్స్ హెడ్ సుధీర్, ఏపీ రీజనల్ బిజినెస్ హెడ్ కేవీ. కృష్ణాజీ, కృష్ణాజిల్లా బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్‌బాబు, ఎల్‌జీ మార్కెటింగ్ హెడ్ అబ్దుల్ ఫరీద్, సోనోవిజన్ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర మూర్తి, ఎల్‌జీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి పొదుపు రేపటి భవిష్యత్ కు ఆధారం

విశాలాంధ్ర-తిరువూరు: నేటి పొదుపు రేపటి బంగారు భవిష్యత్తుకు ఆధారమని యూనియన్ బ్యాంక్ తిరువూరు శాఖ మేనేజర్ వై కృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బ్యాంక్ సేవలు- పొదుపు ఖాతాలు అనే అంశంపై వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ తిరువూరు శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు బ్రాంచ్ మేనేజర్ నగదు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం బ్యాంకుల్లో జరిగే ఆర్థిక లావాదేవీలు, సేవింగ్స్ ఖాతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఆర్థిక స్వేచ్ఛను పొందడానికి విద్యార్థులు సొమ్మును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నేటి పొదుపు రేపటి బంగారు భవితకు ఆధారమని, విద్యార్థులు బాల్యం నుంచే డబ్బు విలువను తెలుసుకొని పొదుపు చేయడం నేర్చుకోవాలని కృష్ణ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయినిలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

23న వ్యవసాయ కార్మిక సంఘం...

ఎన్టీఆర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం.

విశాలాంధ్ర-తిరువూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఈనెల 23 శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరువూరు సుంకరవీరభద్ర రావు భవన్ (సిపిఐ ఆఫీసు) లో జరుగుతుందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు కోరారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ తూము కృష్ణయ్య హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ముఖ్య కార్యకర్తలు సకాలంలో హాజరై, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలయజేయునది ఏమనగా ది.24-6-2023 శనివారం ఉ॥ 11 గం॥లకు గవర్నరుపేట బ్రాంచి నందు 30.00 గ్రాములు మరియు ప్రకాష్‌నగర్ బ్రాంచి నందు 400.00 గ్రాములు మరియు రామవరప్పాడుబ్రాంచి నందు 216.00 గ్రాములు కుదువ పెట్టిన పాత బంగారు నగలు మా హెడ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయి నందున, వారందరికి మా వేలం పాట ప్రకటనలు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంటతీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. నిబంధనల కొరకు దయచేసి మా హెడ్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

H.O.అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
డోర్ నెం. 59-2-1/2, మొదటి అంతస్తు,
అమ్మ ఫంక్షన్ హాల్, అశోక్‌నగర్, విజయవాడ-10.
సెల్: 88851 22377

దస్తావేజు పోయినది

మాగంటి వెంకట లక్ష్మి
W/o. మాగంటి సాంబశివరావు పేరుపై ఒరిజనల్ విక్రయ దస్తావేజు నెం. 3168/1995 రు, ది.16.5.2023న జిరాక్స్ కొరకు కానూరు వెళ్ళుతుండగా పోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయ ప్రార్థన.

సెల్: 8500835113

CHANGE OF NAME

I Vuyyuru Sreelatha (old Name), W/o Vuyyuru Srinivasa Rao, R/o Flat No.503, Mourya Empire Apts, Pedapalakaluru, Revenue ward 54, Pedapalakaluru, Guntur District-522 005, Andhra Pradesh have changed my name to CHIRAKALA SREELATHA. Here after my name is known as CHIRAKALA SREELATHA.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన రెఫ్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెనాలి వారి తరుపున బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియచేయునది ఏమనగా!
ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని కేరళ రాష్ట్రము, కొల్లాం కాపురస్తులు విజయన్-చంద్రిక అనూప్ గారు ది.20-05-2023న బంక సారిక లక్ష్మి మరియు బంక భవ్యలక్ష్మి గార్ల వద్ద నుండి అస్వాధీన విక్రయ ఖరారు అగ్రిమెంట్ పొంది వున్నారు. అట్టి ఆస్తిని సదరు విజయన్ చంద్రిక అనూప్ గారు నా క్లయింట్ కు తనఖాగా ఉంచి ఋణ సౌకర్యంను అభ్యర్థించగా, నా క్లయింట్ మంజూరు చేసి వున్నారు. కావున ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరం వగైరాలు వున్న యెడల నాకు గాని, నా క్లయింట్ గాని ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం రోజులులోగా లిఖిత పూర్వకంగా వ్రాతపూర్వకమైన ఆధారాలతో క్రింద చిరునామాకు సంప్రదించవలెను. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు నా క్లయింట్‌ను బైండు చేయజాలవు, మరియు నిర్వివాద, నిష్పేచీ ఆస్తిగా భావించబడును.
షెడ్యూలు: యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ రి. డి & మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ- 1వటౌన్, ఇస్లాంపేట, పంజాసెంటర్, బి.ఆర్.పి.రోడ్,పాత వార్డు నెం:13, ప్రస్తుత వార్డు నెం: 40, రెవెన్యూ వార్డు: 4, బ్లాక్ నెం:4, యన్.టి.యస్ నెం: 109, పాత అసెస్మెంట్ నెం:8113, వి.యల్.టి.అసెస్ మెంట్ నెం: 1073229930, పాత డోర్ నెం:13/113, ప్రస్తుత డోర్ నెం:12-2-101, దాఖలా చ.గ.50లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు, తూర్పు: హిల్ ఏరియా, దక్షిణం: బంక నాగ చంద్రరావు, మరుపిళ్ళ హేమలక్ష్మి మరియు బంక లక్ష్మి గారల ఆస్తి, పడమర: బి.ఆర్.పి.రోడ్ అనే మున్సిపల్ రోడ్, ఉత్తరం: అబ్దుల్ రజాక్ గారి ఆస్తి.

Geetha Madhavi, Advocate,
D.No:1-8-2, Pulipakavari Veedhi,
Nazar Pet, Tenali,
Guntur Dt, Cell: 9490343121

అటవీభూముల సాగులో వివాదం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలోని తాతకుంట్ల పంచాయితీలో అటవీభూముల సాగు నేపథ్యంలో జనసేన, వైసీపీ నేతల మధ్య వివాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే...ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, నరసాపురం, కొండపర్వ, తాతకుంట్ల, ఏలూరు జిల్లాలోని పలు గ్రామాల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో అటవీభూములు ఆవరించి ఉన్నాయి. గతంలో సిపిఐ సహా పలు వామపక్షపార్టీల ఆధ్వర్యంలో భూఆక్రమణ, పోరాటాలు జరిగాయి. అనంతర కాలంలో నాటి ప్రభుత్వాలు సాగులో ఉన్న కొందరు పేద రైతులకు పట్టాలు, చెట్టుపట్టాలు, వన సంరక్షణ సమితుల పేరుతో హక్కులు కల్పించాయి. నాటి నుంచి మరికొందరు రైతులు అటవీభూములను ఆక్రమించి, సాగు పనులు చేపట్టారు. ఇలా సాగు చేసుకుంటున్న రైతులు బోరుబావులు, విద్యుత్ సదుపాయం వంటి సదుపాయాల కల్పనలో అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా స్థానికంగా ఉన్న కొందరు అధికారపార్టీ నేతలపై ఆధారపడ్డారు. గత మూడేళ్లుగా పలువురు రైతులు యధేచ్ఛగా బోరుబావుల ఏర్పాటుతోపాటు, విద్యుత్ సదుపాయం సైతం సమకూర్చుకున్నారు. జిల్లాల విభజన అనంతరం కొందరు అధికారులు అటవీభూముల రక్షణకు చట్టాలకు పదును పెట్టారు. గత కొద్దిరోజులుగా అడవుల్లో బోర్లు ఏర్పాటు చేస్తున్న పలు వాహనాలను ఏలూరు జిల్లాకు చెందిన అటవీశాఖ అధికారులు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. జలకళ పేరుతో వైసీపీ నేతలు తాతకుంట్ల గ్రామంలో రూ.కోట్లు వసూలు చేశారంటూ జనసేన నేతలు ఆరోపించటం అర్థరహితమని విస్సన్నపేట ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, తాతకుంట్ల వైసీపీ అధ్యక్షుడు షేక్ కాలీషా ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములకు ఉన్న అన్ని ఆధారాలు పరిశీలించి చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం జలకళ పథకం అమలు చేస్తుందన్నారు. అటవీభూముల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్ల ఏర్పాటును అధికారులు అడ్డుకుంటున్న నేపథ్యంలో అందుకు తమ పార్టీని కారకులుగా చేసి, నిరాధార ఆరోపణలు చేయటం తగదన్నారు. సొంత భూమి ఉన్న నిజమైన రైతు జలకళ పథకంలో లబ్ధి పొందేందుకు తమకు ఒక్కరు నగదు ఇచ్చామని నిరూపించినా, అందుకు తాము బాధ్యత వహిస్తామన్నారు. జలకళ పథకం ద్వారా మండలంలోని 12 పంచాయితీలకు 19 బోర్లు మాత్రమే మంజూరవ్వగా, తాతకుంట్ల గ్రామానికి ఒక్కటి కూడా మంజూరు కాకుండానే రూ.కోట్లు ఎలా వసూలవుతాయని వారు ప్రశ్నించారు.

SBFC SMALL BUSINESS FINCREDIT

ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తేదీ: 28 జూన్, 2023 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.
వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎక్కౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎక్కౌంట్లకు చెందినవి.

ఒంగోలు బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎఆర్ఎన్ కాంప్లెక్స్, రెండవ అంతస్తు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పక్కన, కర్నూలు రోడ్డు, ఒంగోలు-523001
ఒంగోలు: AP00293447,AP00323373,AP00323908,AP00342773

విజయవాడ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డి.నం.59/ఎ, 10/1/5, 1వ అంతస్తు, చంద్రాలోక్ కాంప్లెక్స్, కాసా టీవీఎస్ పక్కన, స్టెల్లా కాలేజీరోడ్డు, కె.పి.నగర్, విజయవాడ-520008.
విజయవాడ, AP00150879,AP00312505,AP00423378

భీమవరం బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నం.22-10-18/3, 1వ అంతస్తు, తటవర్తివారి వీధి, ఐడిబిఐ బ్యాంక్ ఎదుట, భీమవరం-534 201
భీమవరం: AP00175460,AP00209038,AP00266884,AP00302340,AP00324854,AP00357163,AP00392350,AP00415417,AP00421244,AP00432526, AP00447923,AP00510894

ఏలూరు బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నం. 23బి-593/1, సావిత్రి కాంప్లెక్స్, 1వ అంతస్తు, ఈదరవారి వీధి, ఏక్సిస్ బ్యాంక్ పక్కన, ఆర్.ఆర్.పేట్, ఏలూరు-534002
ఏలూరు: AP00186919,AP00331518,AP00421645,AP00520390

రాజమండ్రి బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డి.నం.6-1-4, 2వ అంతస్తు, రంగాచారి వీధి, టి.నగర్, రాజమండ్రి-533 101
రాజమండ్రి: AP00270986,AP00334452,AP00336636,AP00424895,AP00488233,AP00520954

గుంటూరు బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నెం.6-10-27, శ్రీ నిలయం, 2వ అంతస్తు, స్వగృహ ఫుడ్స్ ఎదుట, అరండల్‌పేట్, గుంటూరు-522002
గుంటూరు: AP00201114,AP00422651,AP00430024

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సంప్రదించు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కలిగియున్నది.

రుగ్మతలను అధిగమించేందుకు
యోగా ప్రతిఒక్కరూ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నేటి జీవనశైలిలో రోజువారీ ఒత్తిడి, ఇతర రుగ్మతలను అధిగమించేందుకు యోగా ప్రతిఒక్కరూ తమ దినచర్యలో భాగం కావాలని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్ తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ డివిజన్ వ్యాప్తంగా గురువారం డివిజన్ అంతటా యోగా దినోత్సవాన్ని

జరుపుకున్నారు.నగరంలో రైల్వే ఆఫీసర్స్ క్లబ్ పక్కన రైల్వే ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్‌ఎం మాట్లాడుతూ యోగా అనేది ప్రాచీన విజ్ఞాన శాస్త్రం అని, దీనిని ప్రతిరోజు ఆచరించే వారి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. యోగా అనేది ప్రాచీన విజ్ఞాన శాస్త్రం దీనిని ప్రతిరోజు యోగా ద్వారా ఒక వ్యక్తి సమతుల్యత, బలం, వశ్యత, శక్తి మరియు ప్రకాశవంతమైన మానసిక స్థితిని సాధించగలడన్నారు. వృత్తి జీవితంలో మెరుగైన పనితీరు కోసం ముఖ్యంగా ఫ్రంట్‌లైన్ సిబ్బంది లోకో పైలట్‌లు ఒత్తిడిని ఎదుర్కొనేందుకు యోగాసనాలు వేసే అభ్యాసాన్ని అలవర్చుకోవాలని సిబ్బందికి సూచించారు.విశిష్ట అతిథిగా విచ్చేసిన యోగా మాస్టర్ వి.ఈశ్వరరావు (ఎమ్ఎస్‌సి,యోగా) కార్యక్రమానికి హాజరై వివిధ యోగాసనాలు నేర్పించారు. అనంతరం యోగా మాస్టర్‌ను డిఆర్‌ఎం సత్కరించారు.అలాగే విజయవాడ రైల్వేస్టేషన్‌లో,జాక్ అండ్ జిల్ స్కూల్‌లో కుడా యోగా శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్‌ఎంలు (మౌలిక సదుపాయాలు) డి శ్రీనివాసరావు, (ఆపరేషన్స్) ఎమ్. శ్రీకాంత్,సీనియర్ డిపిఒ బాల మురళీధర్,అన్ని శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు

శ్రోతలపై వీచిన గౌరీనాథ్ సంగీత స్వర మారుతం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసులు, సంగీత విద్యా బోధకులు,త్యాగ రాజస్వామి భావించినట్లు ఎటువంటి ఫలాపేక్ష లేకుండా సంగీత సేవలందిస్తూ సంగీత పరిరక్షణలో భాగస్వాములవుతున్న పోపూరి గౌరీనాథ్ గానం సంగీత రసజగత్తులో శ్రోతలను విహరింప చేసింది. అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కళాశాలలోని కళావేదికపై ఆయన గాత్ర సంగీత కచేరి జరిగింది. గౌరీ మనోహరి రాగంలో గురు లేక ఎటువంటి గుణికి,మోహన రాగంలో మోహనరామ వంటి ఇత్యాది కృతులను తనదైన ప్రజ్ఞను కనబరుస్తూ శ్రవణపేయంగా పాడి వినిపించారు. వీరికి అదే కళాశాలలో అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న విష్ణుభట్ల కృష్ణవేణి వయోలిన్ తో పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ లు మృదంగంతో అపారమైన వారి అనుభవాన్ని,సాధనా నైపుణ్యాన్ని కనబరుస్తూ సహకరించారు. ప్రారంభంలో కళాశాల విద్యార్థినులు లాస్య ప్రియ,గుహజ,నయనల వయోలిన్ త్రయ వాయిద్యం ఆహూతుల అభినందనలందుకుంది. నాటరాగంలో మహాగణపతి, శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు పంచరత్న కీర్తన,తెలిసి రామచింతన వంటివి వాయించి వినిపించారు. వీరికి మృదంగంతో సూర్య సహకరించారు. ముఖ్య అతిథులుగా సంగీత రంగాన గాత్ర సంగీత విద్వాంసులుగా అఖండ కీర్తి నార్జించి,సంగీత సేవలందిస్తున్న సుప్రసిద్ధులు మోదుమూడి సుధాకర్,విష్ణుభట్ల సరస్వతి లు అతిథులుగా విచ్చేసి ప్రసంగిస్తూ మనసులో పల్లవించినదే గీతం అని దానికి భాష లేదని అంతర్జాతీయంగా మంత్రముగ్ధులను చేస్తూ, తన్మయులను చేస్తూ ఉల్లాసపరచటం ఆ ఆ సంగీతాలకు గల ఉత్కృష్టతను తెలియ చేస్తుందని అన్నారు. భారతీయ సంగీతానికి ఒక విశిష్టత ఉందని,సామవేదం నుంచి ఉద్భవించిన సంగీతం భక్తి,పవిత్రతల సమ్మేళనమని వాటిని కాపాడుకోవటంలోనే భారతీయ సంగీత సంస్కృతి పరిఢవిల్లుతుందని అన్నారు. పర్యవేక్షణ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభట్ల కృష్ణవేణి చేశారు.

మిక్‌లో యోగ దినోత్సవం

విశాలాంధ్ర-కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజీ అఫ్ టెక్నాలజీ ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యోగ దినోత్సవాన్ని ఘనంగనిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి వంశి కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగ శిక్షకురాలు మానస విద్యార్థులకు యోగ శిక్షణ అందించారు. ప్రతి ఒక్కరు యోగ తమ దినచర్యలో భాగం చేసుకోవాలని, తద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమయిన జీవనాన్ని పొందగలరని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి రాజేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి. పాండు రంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్. వంశి కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి రాజేష్, సీనియర్ అధ్యాపకురాలు తాటి జయశ్రీ, పీడీ ఎన్ సౌరయ్య, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లీనమయ్యే శబ్దం, అద్భుతమైన చిత్రంతో సోనీ బ్రావియా ఎక్స్82ఎల్ సిరీస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బ్రహ్మాండమైన చిత్ర నాణ్యత, అద్భుతమైన ధ్వనితో బ్రావియా ఎక్స్82ఎల్ టెలివిజన్ సిరీస్‌ను విడుదల చేసినట్లు సోనీ ఇండియా ప్రకటించింది. కొత్త ఎక్స్82ఎల్ సిరీస్ విజన్, ధ్వనిని తదుపరి స్థాయికి తీసుకువెళుతుంది. గూగుల్ టీవీతో వినోద ప్రపంచాన్ని అందిస్తుంది. చిత్రం, ధ్వని సాంకేతికత ద్వారా అందమైన రంగులకు జీవం పోస్తుంది. ఈ మోడల్‌లు అన్ని సోనీ సెంటర్‌లు, ప్రధాన ఎలక్ట్రానిక్ స్టోర్‌లు, ఇ-కామర్స్ పోర్టల్‌లలో అందుబాటులో ఉంటాయి.

ముద్రగడను కులం నుండి బహిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాజకీయ లబ్ధితోనే పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేస్తున్న ముద్రగడ పద్మనాభంను కులం నుండి బహిష్కరించాలని అని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపుల్లో ఉన్న అమాయకత్వాన్ని, భావోద్వేగాలను వాడుకొని రాజకీయ లబ్ధితో పొందాలనే విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన ఏనాడు కాపుల కోసం పని చేయలేదని కేవలం తన రాజకీయ లబ్ది కోసమే పని చేశారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కాపులు పవన్ కల్యాణ్ వెంట నడిచే సమయంలో ముద్రగడ అధికార పార్టీ ప్రలోభాలకు లోబడి కులానికి వ్యతిరేకంగా మాట్లాడారన్నారు.కాకినాడ మాఫియా మూలాలు విజయవాడలో ఉన్నాయి అన్నారు.మంచి అయినా చెడు అయినా కాపు జాతి పవన్ కల్యాణ్ వెంటే ఉంటుంది అని అన్నారు.కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ ముద్రగడ మంచి వ్యక్తి అని మేము గతంలో ఎన్నో ఉద్యమాల్లో ఆయనకు తోడుగా నడిచాము అన్నారు.ముద్రగడ కాపుల ద్వేషి,ఆయన వెనుక రెడ్డులు ఉన్నారని ప్రస్తుతం చేసిన విమర్శలతో ఒప్పుకున్నావు అన్నారు. వారాహి యాత్ర విజయవంతం అవ్వటం జీర్ణించుకోలేక పోతున్నారు, వారి అబ్బాయికి సీటు రాదు అని పికే వ్యూహాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు గతంలో కాపులకు ఎన్నో చేశారు, నువ్వు జగన్ మోహన్ రెడ్డిని ఏం అడిగావు కాపులకు ఏం చేశావు అని ప్రశ్నించారు. రైలు దగ్ధం కేసు మరలా రీ ఓపెన్ చేసి దానికి వెనుక ఉన్న రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంఈఓ రవీందర్‌కి సన్మానం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలో బుధవారం పెనుగంచిప్రోలు మండల ఎమ్ ఇ ఓ రవీందర్ కి ఉపాధ్యాయులు ఘన సన్మానంచేశారు.ఎంతో మంది ఉపాధ్యాయులకు మార్గదర్శిగా ఉంటూ , ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న పథకాలను ముందుకు తీసుకెళ్తూ నాడు నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన వంటి పథకాలను సమర్థంగా నిర్వహిస్తూ మండలంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకున్న ఇన్ చార్జీ విద్యాశాఖ అధికారి రవీందర్ కి ఎపిటీఫ్ అధ్వర్యంలో శెట్టిపోగు రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘన సన్మానం జరిగింది. పెనుగంచిప్రోలు మండల విద్యాశాఖాదికారిగా బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించిన ఎమ్ ఇ ఓ రవీందర్ కి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షులు శెట్టి పోగు రాము, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా, జిల్లా కౌన్సిలర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, శ్రీహరి ప్రసాద్, ఆఫీస్ సిబ్బంది చందు, అకౌంటెంట్ రమేష్ ఎమ్ ఐ ఎస్ కో ఆర్డినేటర్ నరేష్ లు పాల్గొన్నారు.

యోగ ప్రపంచమంతా విస్తరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మనసు, శరీరం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులతో కూడిన సమాజం కోసం ప్రతి ఇల్లు యోగ సాధనకు నిలయంగా మారాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. అమరావతి యోగ అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధన నేర్చుకున్న ప్రతి ఒక్కరూ మరి కొంతమంది యోగ సాధకులను తయారు చేయాలన్నారు. భారత ప్రభుత్వం ప్రతి ఏడాది యోగా దినోత్సవం రోజున ఒక కొత్త అంశంతో ఈ వేడుకలను నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం అనే అంశాన్ని భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ అంశాన్ని ఆధారం చేసుకుని వ్యక్తుల మధ్య సామరస్యత పెంపొందించుకోవడం, ప్రతి ఒక్కరి క్షేమాన్ని కాంక్షించడం అనే అంశాలను ప్రాతిపదికగా జరుపుకుంటున్న యోగా దినోత్సవ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్వీకరించాలన్నారు. ఇప్పటి వరకు కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమయిన ఈ వేడుకలను రానున్న రోజుల్లో ప్రపంచమంతా జరుపుకుంటారన్నారు. కొన్ని క్రీడల వల్ల శారీరక దారుఢ్యం మాత్రమే పొందగలమని, కానీ యోగ సాధన వల్ల స్థిరమైన, బలమైన మనస్తత్వం కూడా సొంతం చేసుకోవచ్చన్నారు. ఈ తరహా మనస్తత్వం వల్ల వృత్తి పరమైన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా సమాజంలో గౌరవంగా జీవించవచ్చన్నారు. తొలత 500 మంది యోగ సాధకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరావతి యోగ అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు డీవీ.నాగేశ్వరరావు ఉపాధ్యక్షులు సీహెచ్.లక్ష్మీపతి, కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, యోగ శిక్షకులు సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, వరుణ్ మోటార్స్ ఏడీ పీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి

గోవధకు పాల్పడిన, సహకరించినా వారు చట్టరీత్యా శిక్షార్హులేనని, గోవధ నిషేధ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోవధ నిషేద చట్టం అమలుపై బుధవారం అవగాహన కల్పించే పోస్టర్‌ను జిల్లా జంతు సంక్షేమ సంఘం చైర్మన్ అయిన కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణా, గోవధ నిషేధం, పశుసంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవధను నిషేధించడం జరిగిందన్నారు. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే 6 నెలలు జెలు శిక్ష, వెయ్యి రూపాయల వరకు జరిమాన లేదా రెండూ విధించవచ్చన్నారు. ఈ నెల 29వ తేదీన బక్రీద్ సందర్భంగా గోవధకు పాల్పడకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కూడిన కమిటీలు గోవధ జరగకుండా చట్టం అమలయ్యేలా పర్యవేక్షించాలని, చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోవుల అక్రమ రవాణాపై కూడా అధికారులు గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కే.మోహన్‌కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కే.విద్యసాగర్, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.నాగమణమ్మ, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి కే.అనురాధ, ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి, డీపీవో జయచంద్ర పాల్గొన్నారు.

తోటచర్ల ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తోటచర్ల గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న సాహితీ కాన్వెంట్ పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నందుకు ఆ పాఠశాలకు క్రిమినల్ కేసుతో నోటీసు జారీ చేసినట్లు ఎంఇఓ రవీంద్రనాయక్ బుధవారం తెలిపారు. గత సంవత్సరం లో కూడా ఈ పాఠశాలను మూసివేయించడమైనది, తరిగి పాఠశాల అనధికారికంగా నిర్వహిస్తున్న సమాచారం తో నోటీసు జారీచేయడమైనది. విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తింపు లేని పాఠశాల లో చదివించరాదని,మీరు మోసపో కూడదని, విద్యార్థుల భవిష్యత్తు నష్టపోకూడదని తెలిపినారు. నోటీసు తీసుకుని మళ్ళీ పాఠశాల తెరిస్తే క్రిమినల్ కేసు తోపాటు జరిమాన విధించడం జరుగుతుంది.ఈ పాఠశాల కారణంగా ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల లో 7 గురు ఉపాధ్యాయుల పోస్టు లు రద్దు అయిన విషయం గ్రామస్తులు తెలుసుకోవాలి అన్ని అన్నారు.

వెల్లంకిలో 'అంగన్వాడీ పిలుస్తోంది'

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామంలో అంగన్వాడి-2 కేంద్రం నందు "అంగన్వాడి పిలుస్తోంది" అనే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు సంవత్సరములు దాటిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించడం వలన పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తున్నట్లు, వీటితోపాటు అదనంగా ఇంగ్లీష్ పదాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పుల్లమ్మ, ఆశా వర్కర్స్, సచివాలయ సిబ్బంది, ప్రీ స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

మానవ జీవితంలో యోగ ఒక భాగం కావాలి.

విశాలాంధ్ర-నందిగామ: పాఠశాలలో ఘనంగా నిర్వహించారు, నందిగామ బిజెపి కార్యాలయంలో యోగా గురువు ఆధ్వర్యంలో నాయకులు యోగ, సూర్య నమస్కారాలు, పలు ఆసనాలు బిజెపి నాయకులు, నాయకులు వేశారు, తనవు మనసు ఆత్మ ఒకటి చేసే సాధనం యోగ అని, యోగ, ప్రాణాయామం, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు, మానవ జీవనశలిలో యోగ ఒక భాగం కావాలని పలువురు యోగా గురువులు తెలియజేశారు, పెద్దవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వరావు, కొట్టు వెంకటేశ్వర్లు, విద్యార్థులపై యోగాసనాలు ప్రదర్శన ద్వారా నిర్వహించారు, యోగ వల్ల మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని తెలియజేశారు ఆయా కార్యక్రమాల్లో బిజెపి నాయకులు తొలికొండ సీతారామయ్య, బండారు కేదార్నాథ్ శర్మ, పులిపాటి లక్ష్మీనారాయణ, ముక్కపాటి నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే 'ఆణిముత్యాలు'

విశాలాంధ్ర-కంచికచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థుల ను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గండేపల్లి రాఘవరాయ మెమోరియల్ జిలా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్య కమిట్ చైర్మన్ స్కూల్ అవార్డుల ప్రదానోత్సవం ప్రారంబిచారు. పెత్తందార్ల చేతిలో బందీ అయిన విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి లక్షల్లో డబ్బు గుంజే కార్పొరేట్ స్కూళ్ళ కన్నా మిన్నగా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించి, ఇంగ్లీషు మీడియం బోధనతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంపై చైర్మన్ శ్రీనివాసరావు కొనియాడారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వపాఠశాల రాష్ట్రంలో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, మెరుగైన విద్యను అందిస్తూ, ప్రతి పేద కుటుంబం నుండి డాక్టరు, ఇంజనీర్, కలెక్టర్, సైంటిస్టులు తయారవ్వాలనే తపన, తాపత్రయంతో పిల్లలను మరింత ప్రోత్సహించేందుకు అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం చేపట్టింది. యాజమాన్యం లోని వివిధ కేటగిరీ విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు వివిధ క్యాటగిరీలలో అవార్డులు అంద చేస్తారు. 10వ తరగతిలో, కేటగిరీ వారీగా జెడ్.పి, మున్సిపల్, మోడల్, ట్రైబల్/ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిలో అవార్డులు అందిస్తారు. ప్రతి స్థాయిలో మొదటి 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్కారవికుమార్ బెల్లంకొండ శ్రీనివాసరావు ఉపసర్పంచ్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి ప్రధాన ఉపాధ్యాయులు చావా రామకృష్ణ ,విద్యా కమిటీ ఉపాధ్యాయులు విద్యార్థి లు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారికి సన్మానం

విశాలాంధ్ర-గంపలగూడెం : మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.వి.డి.ఎల్. నరసింహారావు కు బుధవారం నాడు విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు .పి. ఆర్. టి. యు, మరియు యు.టి.ఎఫ్. నాయకులు దుశ్యాలవాలతో, పూలమాల ల తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి .ఆర్. టి. యు మండల శాఖ కార్యదర్శి అట్లూరి. సుధాకర్ రెడ్డి, నాయకులు దండపాటి .అజయ్ కుమార్, కిరణ్ ,శరత్ బాబు, రేగళ్ల. అంజిరెడ్డి, కాంతారావు, యు.టి.ఎఫ్ మండల శాఖ అధ్యక్షులు చిల్ల పల్లి. రమేష్, నాయకులు కోట. శ్రీనివాసరావు, వి .అపర్ణ, పి. ఏడుకొండలు, పి. రాధాకృష్ణ, వీ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలో ప్రతిరోజూ యోగా: నదిలో యోగా దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ : కృష్ణానదీ తీరాన కొండవీటివాగు ఎదురుగా వన సముదాయ కోవిడ్ ఫలవనంలో అవార స్విమ్మర్స్, రన్నర్స్ యోగాదినోత్సవం సూర్యోదయం ముందే ఘనంగా నిర్వహించారు. యోగాగురువు చైతానంద సరస్వతి ఈ సందర్భంగా యోగోపాఖ్యానం ప్రవచించారు. యోగా ఏదో ఏటా వచ్చే ఓనాటి ప్రహసనం కాదని, అది జీవన విధానమని, అది అభ్యాసం చేసే ప్రదేశం కూడా ప్రకృతితో అనుసంధానమై యుండాలన్నారు. నదీతీరాన ప్రతిదినం ఇదే కోవిడ్ వనంలో వేకువనే అవార ఆధ్వర్యంలో యోగాభ్యాసం చేయిస్తామని తెలిపారు. మహిళా ఈత శిక్షకురాలు శకుంతలాదేవి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో స్విమ్మర్స్ భవాని, సీతామహాలక్ష్మి, సుదర్శన్, భావన, రాధిక, కమలాకర్, రాజకమల్, అమూల్య, హృత్విక్, సాకేత్, మణికంఠ పాల్గొన్నారు. నిత్యం 05:30 నుండి 06:30 వరకూ జరిగి యోగసాధనలో పాల్గొన ఆసక్తి గలవారు అవారలో 09494126812 లో సంప్రదించవచ్చని చైతానంద సరస్వతి తెలిపారు.

పాఠశాలల్లో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విద్యార్థుల్లో ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన పెంపొందించేందుకు మండల స్థాయిలోని పాఠశాలల్లో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ప్రియాంక తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన కల్పించే విధంగా పాఠశాల విద్యార్థులకు మండల జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహించాలని ఆదేశించారన్నారు. దీనిలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 26 మంది విద్యార్థులకు పటమటలంకలోని కేఎస్ఆర్‌జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో జెడీఎంఎంసీ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, కేఎస్ఆర్‌జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు 2వ స్థానం, డీఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు 3వ స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 28వ తేదిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యుబీఐ రింగ్‌రోడ్డు బ్రాంచ్ మేనేజర్ కే.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

హెల్త్ ఎన్ వెల్త్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం-కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జాతీయ సమగ్రతను పెంపొందించే విధంగా పాన్ ఇండియా అవార్డులను ప్రదానం చేసేందుకు హెల్త్ ఎన్ వెల్త్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, క్షత్రియ ఐక్యవేదిక, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించే పాన్ ఇండియా అవార్డులు ప్రధానోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా పౌరుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల నుండి స్వాతంత్ర్య సమరయోధులు, డాక్టర్లు, నేతాజీ మనుమడు, నమోఫౌండేషన్ చైర్మన్ రమేష్ చౌహాన్ వంటి ప్రముఖులను జూలై 4న అవార్డులతో హెల్త్ ఎన్ వెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంత్కరించనున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ అధ్యక్షులు జే.చైతన్య, హెల్త్ ఎన్ వెల్త్ ఫౌండేషన్ నిర్వహకులు డాక్టర్ సీహెచ్.రామచంద్, డాక్టర్ విశ్వనాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపా కేసులు రద్దు చేయాలి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి. సంధ్యతో పాటు మరో 146 మందిపై తెలంగాణ పోలీసులు పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పి.ఓ.డబ్ల్యు రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు పివో డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్. విష్ణు అధ్యక్షత వహించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. పద్మ మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగస్టు 19 ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యు) జాతీయ కన్వీనర్ వి. సంధ్య, ప్రజాపక్ష మేధావి ప్రొఫెసర్ జి. హరగోపాల్ తదితర 152 మంది ప్రజా సంఘాల నాయకులు పై రాజ ద్రోహం కుట్ర కేసును ఉపాగా నమోదుచేసి 9 నెలలు తరువాత ఇప్పుడు ప్రకటించారన్నారు. అసమానతలు లేని సమాజం కోసం ముఖ్యంగా స్త్రీల హక్కుల కోసం మూడు దశాబ్దాలకు పైగా రాజీలేని పోరాటం చేస్తున్న సంధ్య పై దేశద్రోహం కింద ఉపా కేసు పెట్టాడు రాజ్యాంగ విరుద్ధం అన్నారు.ఈ కేసులు పట్ల పెద్ద ఎత్తున నిరసనలు రావడంతో ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు ఆరుగురిని కేసు నుంచి తప్పిస్తున్నట్లు కేసిఆర్ ప్రకటించారు.మిగిలిన 146 మంది మీద కేసు కొనసాగుతున్నాయి.వీరంతా తెలంగాణ రాష్ట్రం కోసం కేసిఆర్‌తో పాటు ఉద్యమంలో పాల్గొని పోరాడితే తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మేధావులు,రచయితలు న్యాయవాదులుపై నిర్బంధాన్ని ప్రయోగించడం అప్రజాస్వామిక చర్య అన్నారు.తెలంగాణ,ఆంధ్ర అనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రశ్నించే గొంతుకులపై మోడీ ప్రభుత్వం ఉపా చట్టం పేరుతో దేశద్రోహం ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని విమర్శించారు.ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు మావోయిస్టు పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నాయని దానికి నిదర్శనం ఒక డైరీలో వీరందరి పేర్లు ఉన్నాయని 2022లో కేసు పెట్టి ఇప్పుడు ప్రకటించడం లోనే కుట్ర దాగి ఉందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజాస్వామిక విలువల కోసం, రాజ్యాంగ హక్కుల కోసం సమానత్వం కోసం పోరాడుతున్న మేధావులు న్యాయవాదులు ప్రజాసంఘాల నాయకులు దేశద్రోహులు ఎలా అవుతారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని విమర్శించారు. తక్షణమే ఉప చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో న్యాయవాదుల సంఘం నాయకులు పిచ్చుక శ్రీనివాసరావు,న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ప్రసాద్, విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవెల్లి కృష్ణ, పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు యు .గనిరాజు, కె ఎన్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, సిఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ రాధా. పీకేఎస్ రాష్ట్ర నాయకులు కొండారెడ్డి, పిడిఎస్ యు జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, పివో డబ్ల్యు గంగాభవాని,రాజశేఖర్, పి.ఓ.డబ్ల్యు రాష్ట్ర నాయకులు మంజుల,రమ,ఇఫ్టూ నాయకులు వెంకటకృష్ణ,రవీంద్ర,వెంకటరమణ,మురళి,తదితరులు పాల్గొన్నారు